"ప్రపంచ ఆరోగ్య సంస్థ - ప్రపంచ ఆరోగ్యదినం సందర్భంగా టోక్యోలో నిర్వహిస్తున్న 'కేర్ ఆఫ్ ది టెండర్ హార్ట్స్" సెమినార్ ప్రారంభ సభ ప్రత్యక్షప్రసారం... కొద్ది క్షణాల్లో" టి.వి. ఎనౌన్స్‌మెంట్.

హిందూ దేశస్థులకు అది ఒక ప్రత్యేక దినం. కారణం... ఆ సెమినార్‌కి కీనోట్ అడ్రస్ ఇస్తున్నది భారతీయుడు. పైగా తెలుగు బిడ్డ.

తన స్వంత కొడుకు... ఒక్కగానొక్క కొడుకు. వెయ్యి పౌర్ణమి చంద్రులను చూసిన డాక్టర్ రమణారావుకి మరింత గర్వకారణం.



పితృదేవోభవ

టి.వి.కి దగ్గరగా కూర్చున్నాడు. కరెంట్ పోకూడదని దేవుళ్లందరికీ మొక్కుకున్నాడు.

ముఖ్య అతిథులు, వక్తలు వేదికపైకి వచ్చారు. వారు వస్తున్నప్పుడే పరిచయ వాక్యాలు చకచకా జరుగుతున్నాయి.

డాక్టర్ ఆనంద్... ఆనంద్ వచ్చాడు. తనకు నిర్దేశించిన స్థలంలో కూర్చున్నాడు. రమణారావు కళ్ళు పెద్దవి చేసుకుని మరీ చూసాడు. వేయి కళ్ళతో చూసాడు. నిజం చెప్పాలంటే... కొడుక్కి నరదిష్టి తగలకూడదని దేవుడ్ని ప్రార్థించాడు.

ఒకరి వెనుక ఒకరు... పరిచయ వాక్యాలు... చిన్న చిన్న ఉపన్యాసాలు... చకచకా జరిగిపోయాయి.

"కీ నోట్ అడ్రస్ - డాక్టర్ ఆనంద్‌ని పరిచయం చేయవలసిన అవసరం లేదు. ఆయన వైద్యరంగంలో ముఖ్యంగా - పసిపిల్లల హృదయవ్యాధులు - శస్త్ర చికిత్సలలో నిష్ణాతులని అందరికీ తెలుసు. అటువంటి ప్రపంచ ఖ్యాతి గడించిన డాక్టర్ ఆనంద్‌ని కీనోట్ అడ్రస్ ఇమ్మని ఆహ్వానించడానికి నేనెంతో గర్వపడుతున్నాను. డాక్టర్ ఆనంద్..." అని సభాధ్యక్షుడు డాక్టర్ ఆనంద్‌ని పరిచయం చేయడంతో అంత వరకూ నిశ్శబ్దంగా ఉన్న హాలు కరతాళ ధ్వనులతో మారుమోగింది.

"సభస్సృతులను సుమారు మూడు దశాబ్దాలు వెనక్కి తీసుకువెళ్ళాడు డాక్టర్ ఆనంద్.

"సుమారు మూడు దశాబ్దాల క్రితం డాక్టర్ స్టీవ్ బెర్నార్డ్ గుండె మార్పిడి చేసి - మనల్ని అందర్నీ ఆశ్చర్యచకితులను చేసాడు. మరణించిన ఒక వ్యక్తి హృదయం మరొకరి శరీరంలో పనిచేసింది. అతనికి పునర్జన్మ ఇచ్చింది... ఓపెన్ హార్ట్ సర్జరీ మామూలు అయిపోయింది. ప్రపంచంలో నుంచి పోలియో ఇంచుమించుగా నిర్మూలించబడింది. అది వైద్య రంగంలో కేవలం చరిత్రలో ఒక పుటగా మిగిలింది. ఎయిడ్స్‌కి ప్రస్తుతానికి మందులు లేవు. ఉన్నాయి కానీ పూర్తిగా ఎఫెక్టివ్ కాలేదు. రాకుండా చేసుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు మనకు తెలుసు. ఈ రోజు కాకపోతే రేపు మందులు కనుక్కుంటారు - వాక్సీన్ తయారుచేస్తాం.

పెద్ద వారిలో ఈ వ్యాధులు చాలావరకూ మన అజాగ్రత్త వల్లే వస్తాయి. ఆరోగ్యకరమైన వ్యాయామం - ఆహారం ముఖ్యం.

డయాబెటిస్‌ని అదుపులో పెట్టుకోవచ్చు - హృదయరోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చు. తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటే సగం పైగా వ్యాధులు వాటంతట అవే మాయమైపోతాయి. బహుశా అపుడు ఇంతమంది వైద్యుల అవసరం ఉండదేమో?

సభలో సన్నగా నవ్వులు.

మనం ఈ రెండు రోజులూ చర్చించేది - మాట్లాడేదీ వీటితో సంబంధం లేని విషయం.

మనం విశేషంగా చర్చించేది - పసికందులకు పుట్టుకతోనే వచ్చే హృదయ సంబంధమైన వ్యాధులు, లోపాలు.

పసికందులు హృదయ వ్యాధులతో - లోపాలతో జన్మిస్తే దానికి కారణం ఎవరు? పెద్దలు అజాగ్రత్త వల్ల వ్యాధులు కొని తెచ్చుకుంటారు. కానీ పిల్లలు... పుట్టుకతోనే అలా జన్మిస్తే వాళ్లను మనం ఎలా కాపాడాలి? దానికి మనం ఏం చేయగలం. వీటికి ఇంకా దూరంగానే

ఆనందకృష్ణ

ఉన్నాం. ఒక పక్క వయసు మళ్లినవారు - పూర్తిగా జీవితాన్ని అనుభవించినవారు, రెండో ప్రక్క తల్లి ముఖం కూడా సరిగా చూడలేని, రోజుకి 20 గంటలు పైగా కళ్ళు మూసుకునే ఉండే పసివాళ్లు. ఈ రెండిటికీ ఎంత తేడా ఉంది వైద్యంలో?

ఈ రంగంలో కూడా మనం పురోగమిస్తున్నాం. కేవలం రోజుల వయసు గల చిన్న పిల్లలపై విజయవంతంగా శస్త్ర చికిత్సలు చేసాం. కేవలం ఏడునెలలైనా తల్లి గర్భంలో ఉండకుండా ప్రసవించబడిన - కేవలం 640 గ్రాముల బరువు... ఛాతీ కేవలం మన అర చేయి అంత... హృదయం ద్రాక్షపండుతో సమానం... విజయవంతంగా శస్త్ర చికిత్స చేసాం. రెండు రోజులు, 15 రోజులు - ఇలా ఎన్నో ఎన్నో కేసులున్నాయి.

అయితే చిన్న పిల్లలు కంజేనిటల్ హార్ట్ డిఫెక్ట్స్‌తో ఎందుకు పుడతారు? అనేది నిర్ధారణగా చెప్పలేం. మనకు తెలిసిన కారణాలకంటే తెలియనివే ఎక్కువ. కంజేనిటల్ హార్ట్ డిఫెక్ట్‌తో పిల్లలు ఎందుకు పుడతారు? మనకు తెలిసిన కొన్ని కారణాలు - పసిపిల్ల అసాధారణమయిన క్రోమోజోమ్స్ - 3 నుంచి 5 శాతం, జీన్ డిఫెక్ట్స్ 3-5 శాతం, నివసిస్తున్న వాతావరణం, పరిస్థితులు 4 శాతం, పిల్ల తల్లిగర్భంలో ఉన్నప్పుడు తల్లి తీసుకున్న కొన్ని మందుల ప్రభావం కూడా ఉంటుంది అని నా అనుమానం - అంటే మనకు తెలిసిన కారణాలు 10-20 శాతం, తెలియనివి 80-90 శాతం.

పిల్ల తల్లిగర్భంలో ఉన్నప్పుడు 18-22 వారాల మధ్య అవసరమనిపిస్తే ఫీటల్ ఎకో కార్డియోగ్రఫీ ద్వారా హృదయ పెరుగుదలలో ఏమైనా లోపాలుంటే తెలుసుకోగలుగుతున్నాం - సరి చేయగలుగుతున్నాం - నమ్మశక్యం గాని పరిస్థితుల్లో పసికందుల జీవితాల్ని కాపాడ గలుగుతున్నాం.

అయితే సి.హెచ్.డి. విషయంలో ఇంకా చేయవలసింది చాలా ఉంది. మనం మొదటి దశలోనే ఉన్నాం.

పిల్లల హృదయాలపై మనం చేసిన విజయవంతమైన, క్లిష్టమైన శస్త్ర చికిత్సలు చూసి మురిసిపోవద్దు. ఈ సెమినార్‌కి మహామహులు హాజరవుతున్నారు. దిగ్గజాలు వచ్చారు - వాళ్ల అనుభవాలు తెలుసుకుందాం. అభిప్రాయాలు తెలుసుకుందాం... మన ఆశయం ఒకటే - సిహెచ్‌డి నిన్నటి చరిత్ర కావాలి. చరిత్రలో ఒక పుటగా మార్చేద్దాం... ప్రపంచంలో రేపు ఏ పసికందూ సిహెచ్‌డితో జన్మించకూడదు. అదే మన ధ్యేయం - మన లక్ష్యాన్ని సాధిద్దాం".

అరగంట సేపు అనర్గళంగా మాట్లాడి, తన కీనోట్ అడ్రస్ పూర్తి చేసాడు. అంతవరకూ నిశ్శబ్దంగా స్పీచ్ విన్నవాళ్లందరూ నిలుచుని కరతాళ ధ్వనులు చేసారు గౌరవసూచకంగా.

"ఇంతవరకూ ప్రపంచ ఆరోగ్య సంస్థ - ప్రపంచ ఆరోగ్యదిన సందర్భంగా టోక్యోలో నిర్వహిస్తున్న "కేర్ ఆఫ్ ది టెండర్ హార్ట్స్" సెమినార్ ప్రారంభసభ ప్రత్యక్షప్రసారం చూసారు".

టి.వి. ఆపేసారు డాక్టర్ రమణారావుగారు.

వెంటనే ఫోన్ చేసారు డాక్టర్ రాజారావుకి. వారిద్దరూ ప్రాణ స్నేహితులు - డాక్టర్లు. ఇంచుమించు పక్కపక్క ఇళ్లే. ఇద్దరికీ ఒక్కొక్క కొడుకే. వాళ్లూ డాక్టర్లే. రమణారావు కొడుకు ఆనంద్ పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్, సర్జన్. రాజారావు కొడుకు శేఖర్ హార్ట్ సర్జన్.

"ప్రోగ్రామ్ చూసావా?"

ఒరేయ్! ఆనంద్ నీకు కొడుకైతే - వాడు నా ప్రాణ స్నేహితుడి కొడుకు. ఎలా మర్చిపోతాను? - అసలు అక్కడికే వద్దామనుకున్నాను - కానీ మనం ఇద్దరం ఒక చోట చేరితే... మనం చూడం - రెండోవాడిని చూడనియ్యం. ఇపుడే వస్తున్నాను. మాట్లాడుదాం".

పది నిమిషాల్లో వచ్చారు డాక్టర్ రాజారావు.

"ఏడీ శేఖర్ రాలేదా?"

"లేదురా. వాడు ఊళ్లో లేడు. మిస్ అవుతాడేమోనని వాడి కోసం రికార్డ్ చేసాను"

"మనం గర్వపడేలా చేసాడు - మనవాడు" ఆనందంతో కారిన కన్నీళ్లు రాజారావుగారి కళ్ళజోదుని మసకగా చేసాయి. కళ్లజోదు తీసి తుడుచుకున్నాడు.

స్నేహితులు ఇద్దరూ కౌగలించుకున్నారు - వాళ్ల సంభాషణ ఆనంద్, శేఖర్ చిన్నతనం రోజులూ, వాళ్ల అమ్మలు వాళ్లను పెంచిన తీరు, మెడికల్ కాలేజి చదువు ఒకటేమిటి...

"ఆనంద్‌కి ఫోన్ చేసి మాట్లాడుదాం" రమణారావు మాటకు "ఇప్పుడేగా అయ్యింది... బిజీగా ఉండి ఉంటాడు. కొంచెం సేపు ఆగి చేద్దాం" రాజారావుగారి జవాబు.

మరొక అరగంట జరిగింది. ఇక ఆగలేకపోయాడు.

ఆనంద్ కాంటాక్ట్ నంబర్‌కి ఫోన్ చేసాడు రమణారావు.

"సారీ సార్ ఆయన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. డిస్టర్బ్ చేయలేను"

"నేను ఆనంద్ తండ్రిని"

ఆయనను అడ్డు పెట్టలేకపోయాడు.

"జస్ట్ ఎ మినిట్ సార్ - ఐ విల్ ట్రై"

"యువర్ ఫాదర్ ఆన్ ది లైన్ సర్ - స్పష్టంగా విన్పించాయి" సెక్రటరీ మాటలు డా॥ రమణారావుకి.

తను ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఉన్నానన్నమాట కూడా మర్చిపోయి, "చెప్పండి డాడీ ఎలా ఉన్నారు?"

కొన్ని క్షణాలు రమణారావుగారి నోట మాటలేదు - ఆనందంతో.

"డాడీ ఈజ్ ఎవిరిథింగ్ ఫైన్" కొంచెం ఆందోళనగా ప్రశ్నించాడు ఆనంద్.

"చాలా సంతోషంగా ఉందిరా - ఆగలేక ఫోన్ చేసాను.

ఐయామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యూ"

"నిన్ను కాన్ఫరెన్స్‌లో డిస్టర్బ్ చేయలేదు కదూ?"

"లేదు డాడీ - మీతో మాట్లాడడం నాకు ఎప్పుడూ డిస్టర్బెన్స్ కాదు.

తన కొడుకు - పిడియాట్రిక్, కార్డియాలజిస్ట్ సర్జన్. ప్రపంచప్రఖ్యాతి పొందిన డాక్టరు - ఆయన సంతోషానికి హద్దు లేదు. నోట మాట రావడం లేదు.

ఇది ఆనంద్ అర్థం చేసుకున్నాడు. "డాడీ వీలయినంత త్వరలో ఇండియా వస్తాను మిమ్మల్ని చూడాలని అందరం ఎదురుచూస్తున్నాం"

"ఒక్క నిమిషం. డాక్టర్ రాజా అంకుల్ మాట్లాడతాడు".

"ఎస్ అంకుల్ ఎలా ఉన్నారు?"

"ఉయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యూ బాయ్ - గాడ్ బ్లెస్ యూ"

"థ్యాంక్యూ అంకుల్. వచ్చే నెలలో ఇండియా వస్తున్నాం. డాడీని ఒప్పించండి అంకుల్

– ఇక్కడకు రావడానికి. లేకపోతే మేమే వచ్చేయవలసి ఉంటుంది".

"చూద్దాం. మీ నాన్న రెండింటికీ ఒప్పుకోడు. చూద్దాం"

మళ్లీ ఫోన్ రమణారావుకి ఇచ్చాడు రాజారావు.

"ఎల్లుండి ఎల్.ఏ. చేరతాను డాడీ – వెళ్ళగానే ఫోన్ చేస్తాను. టేక్ కేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్... బై"

* * *

సెమినార్ రెండు రోజులూ రెండు క్షణాలుగా గడిచిపోయాయి. భార్య డాక్టర్ స్నేహకు, మెడిసిన్ చదువుతున్న పిల్లలకూ ఒక్కసారి "హాయ్" అనగలిగాడు ఆ రెండురోజుల్లో.

* * *

ఆనంద్‌కి ఎప్పుడూ విండో సీట్ కావాలి. పక్క సీట్లో భార్య స్నేహ, వెనుక పిల్లలు – ఏమిటి మరీ చంటి పిల్లాడిలా విండో సీటు పిచ్చి? నవ్వుతూ అంటుంది స్నేహ. ఈ సారి ఆవిడ తన పక్కన లేకపోవడం కొంచెం వెలితి అన్పించింది.

టోక్యో విమానాశ్రయం వదిలింది విమానం.

కునుకు తీయడానికి ప్రయత్నించాడు. మానసికంగా, శారీరకంగా చాలా అలసిపోయాడు ఆనంద్. అయినా నిద్ర రాలేదు. ఎందుకో తలపులు అన్నీ తండ్రిమీదే – తల్లి యూనివర్శిటీలో పని చేసేది. తను ఒక్కడే కొడుకు. తల్లి, తండ్రి అతనికి ఇచ్చిన అభ్యాసం, పెంచిన విధానం అతడిని ఇంతటి వాడిని చేసింది ఈ నాడు. తల్లిపోయి రెండు సంవత్సరాలు కూడా కాలేదు. ఆమె మరణం తండ్రి మీద చాలా ప్రభావం చూపింది. ఆయన ఆరోగ్యం మునపటిలా లేదు. ఎన్నోసార్లు చెప్పాడు... "డాడీ మీరు అమెరికా వచ్చేయండి మా దగ్గరకు. లేకపోతే మేమే వచ్చేస్తాం అని. కోడలు స్నేహని వారు ఎప్పుడూ కోడలుగా చూడలేదు – కూతురిలా చూసేవారు. ఆమె కూడా అలాగే ప్రవర్తించేది. ఈసారైనా ఎలాగో ఒప్పించి తన కూడా అమెరికా తీసుకువెళ్ళాలి. ఏవో ఆలోచిస్తున్నాడు – అలాగే ఒక కునుకు తీసాడు.

లాస్‌ఏంజెలెస్ ఎయిర్‌పోర్ట్ చేరుకుంది విమానం. కేబిన్ అనౌన్స్‌మెంట్‌కి మెలకువ వచ్చింది ఆనంద్‌కి.

ఎయిర్‌పోర్ట్‌కి స్నేహ, పిల్లలూ వచ్చారు.

"చాలా అలసిపోయినట్టున్నారు" అంది స్నేహ.

"ఎలా జరిగింది డాడీ సెమినార్?" పిల్లలు ప్రశ్నించారు.

ఆనంద్‌కి ఏదో వెలితి కన్పించింది. వాళ్ళ ముఖాలు మామూలుగా కన్పించలేదు.

"మీ స్పీచ్ మీద రియాక్షన్ ఎలా ఉంది?" స్నేహ ప్రశ్న.

"అందులో సగంపైగా డేటా, ఫాక్ట్స్ నువ్వు ఇచ్చినవే కదా. సరిగా జరుగక ఎలా జరుగుతుంది?".

స్నేహ మామూలుగా నవ్వలేదు. ఏదో చెప్పాలనుకుంటోంది. చెప్పలేకపోతోంది. ఎలా చెప్పాలా అని ఆలోచిస్తోంది అన్పించింది ఆనంద్‌కి.

కొడుకు కారు డ్రైవ్ చేస్తున్నాడు – అతను పక్కన కూర్చున్నాడు.

"ఏమయింది రవీ – ఎవిరిథింగ్ ఫైన్?"

కొడుకుని ప్రశ్నించాడు.

"డాడీ - మనం రేపు ఇండియా వెళుతున్నాం"

"వాట్! ఏమయింది? ఇండియా ఎందుకు వెళ్ళాలి" ఎగిరిపడ్డాడు ఆనంద్ కంగారుగా.

ఆ క్షణంలో - తండ్రికి ఏమైనా అయిందా అనే ఆలోచన.

కంగారు పడకండి. డాక్టరు శేఖర్ ఫోన్ చేసాడు. డాడీకి హార్ట్ ఎటాక్. మైల్డ్. మీకు టోక్యో ఫోన్ చేసారుట. అప్పటికే మీరు ఎల్.ఎ.కి బయలుదేరారు. నాకు ఫోన్ చేసి చెప్పారు. ఈ కొద్ది గంటల్లో నేను అయిదారు సార్లు ఫోన్ చేసాను. డోంట్ వర్రీ. ఎవిరిథింగ్ విల్‌బి ఆల్ రైట్" స్నేహకి మామగారిని డాడీ అనడం అలవాటు.

ఆనంద్‌కి మనసు మనసులో లేదు. సెల్ తీసాడు. శేఖర్‌కి ఫోన్ చేసాడు.

"శేఖర్ డాడీకి ఏమయింది? నా కీనోట్ అడ్రస్ అవ్వగానే ఫోన్ చేసారు. ఎంతో సంతోషంగా మాట్లాడారు. ఇంతలో ఏమయింది? ఈ రెండు మూడు రోజుల్లో?"

"ఏమీ కంగారుపడొద్దు. అన్నీ కంట్రోల్‌లో ఉన్నాయి" బుకాయించడానికి ప్రయత్నించాడు శేఖర్.

ఆనంద్ ప్రశ్నల పరంపరకు తట్టుకోలేక నిజం చెప్పకతప్పలేదు. పూర్తి వివరాలు చెప్పాడు. చేసిన టెస్ట్‌లు,రిజల్ట్స్ చెప్పాడు. నీకు తెలుసుకదరా - డాడ్ పేస్‌మేకర్ వాడుతున్నారు. కొన్ని కొన్ని చేయలేం - చేస్తున్న ట్రీట్‌మెంట్ పూర్తి వివరాలు చెప్పాడు. తను అక్కడ తండ్రి పక్కన ఉండి ఉంటే అదే వైద్యం చేసేవాడు. ఆ విషయంలో అతనికి ధైర్యం... వైద్య లోపం ఉండదు. ఆ ధైర్యం ఉన్నా తన తండ్రి పరిస్థితి అతనికి ఆందోళన కలిగిస్తోంది. శేఖర్ చెప్పిన మాటలను బట్టి దేవుడి మీదే భారం. మానవ ప్రయత్న లోపం లేదు. డాక్టర్లు ఆ పరిస్థితిలో అంతకంటే చేయగలిగింది ఏమీలేదు. గంట గంటకీ శేఖర్‌కి ఫోన్ చేస్తూనే ఉన్నాడు. శేఖర్ ఒకటే జవాబు "నేను డాడీ దగ్గరే కూర్చున్నాను".

* * *

లాస్‌ఏంజెల్స్ ఎయిర్‌పోర్ట్ జనంతో కిటకిటలాడుతోంది. ఆనంద్, స్నేహ, పిల్లలు చెకిన్ వైపు నడుస్తున్నారు. విమాన రాకపోకల ఎనౌన్స్‌మెంట్స్... మధ్య మధ్యలో ఏవేవో చెబుతున్నారు. ఆనంద్‌కి ఇవి ఏమీ విన్పించడం లేదు. ఆలోచనలు అన్నీ తండ్రిమీదే. ఎంత తొందరగా వెళ్లి తండ్రి పక్కన వాలుదామా? అన్న ఆదుర్దా.

"డాడీ - మీ పేరు ఎనౌన్స్ చేస్తున్నారు. డాక్టర్ జిమ్ మీకోసం వెయిట్ చేస్తున్నారట. ఎంక్వయిరీ దగ్గరకు మీరు అర్జంటుగా వెళ్ళాలిట"

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు ఆనంద్. డాక్టర్ జిమ్ ఎయిర్‌పోర్ట్‌కి ఎందుకు వచ్చి ఉంటాడు? అంత అర్జంట్ ఏమిటి? అర్థం కాలేదు. ఎంతో అర్జంట్ అయితే కానీ రాడు. మామూలు విషయం అయితే సెల్‌కి ఫోన్ చేసేవాడు.

స్నేహా... నువ్వు, పిల్లలూ చెకిన్ దగ్గర లైన్‌లో నిలుచోండి. డాక్టర్ జిమ్‌ని కలుసుకుని నేను వస్తాను. ఎంక్వయిరీ వైపు వెళ్లాడు ఆనంద్.

ఆనంద్ మానసిక పరిస్థితి తెలిసిన స్నేహ అతడిని ఒక్కడినీ వెళ్లనియ్యలేదు.

"రవీ - నువ్వు, చెల్లాయి వెళ్ళండి. నేను కూడా నాన్నగారితో వెళ్తాను" పిల్లలు చెకిన్

వైపు ఆనంద్, స్నేహ ఎంక్వయిరీ వైపూ వెళ్లారు.

"డాక్టర్ జిమ్ ఇలా వచ్చావేమిటి? అర్జంటా? డెబ్బీ ఎలాఉంది. డెబ్బీ డాక్టర్ జిమ్ భార్య. ఆమె కూడా డాక్టరే. ఆమె ప్రెగ్నెంట్ - పురిటి రోజులు.

"నిన్ను కలుసుకోవడానికి హాస్పిటల్‌కి వెళ్ళాను. నువ్వు ఇండియా వెడుతున్నావని, ఎయిర్ పోర్ట్‌కి వెళ్లావని చెప్పారు. ఫోన్‌లో చెప్పలేని విషయం... మాకు ఆడపిల్ల పుట్టింది. రెండు రోజులయింది. 'ఆలిస్' అని పేరు పెట్టాం. ఆలిస్ సిహెచ్‌డి కేసు. ఇవిగో రిపోర్ట్స్. 24 గంటల్లో సర్జరీ చేయకపోతే ఆలిస్ శ్వాస ఆగిపోతుంది. నువ్వు తప్ప ఈ సర్జరీ ఎవరూ చేయలేరు అని మా ఇద్దరి నమ్మకం. పైగా డాక్టర్ కార్ల్ ఇంకా టోక్యోలోనే ఉన్నారు. ఏమీ తోచక నీ దగ్గరకు పరుగు పరుగున వచ్చాను"

"ఆనంద్ తండ్రికి హార్ట్ ఎటాక్. కండిషన్ సీరియస్‌గా ఉంది. అందుకనే మేం ఇండియా వెడుతున్నాం" అంది స్నేహ.

"అయామ్ సో సారీ - నాకు తెలీదు ఆనంద్. నీ తండ్రి జీవన్మరణాల మధ్య ఊగిసలాడుతూంటే - నా పాపకు సర్జరీ చేయడానికి ఇక్కడ ఉండిపో... అని ఏ ముఖంతో అడగగలను!? మీ తండ్రి కోలుకోవాలని ప్రార్థిస్తాం... ఆల్ ది బెస్ట్" వెనుదిరిగాడు జిమ్.

"జస్ట్ ఎ మినిట్ జిమ్" ఏమనుకున్నాడో - ఏం ఆలోచించాడో తెలీదు. సెల్ తీసాడు. శేఖర్‌కి ఫోన్ చేసాడు. శేఖర్‌కి జిమ్, డెబ్బీ బాగా తెలుసు.

"ఆనంద్ శేఖర్‌కి ఆలిస్ విషయం చెప్పాడు. సర్జరీ చేయకపోతే బ్రతకడం కష్టం. నీ సలహా ఏమిటి?" అడిగాడు.

"ఆనంద్! విషయాలు అన్నీ చెప్పాను... మీ తండ్రి సహస్రపౌర్ణాలు చూశారు. వయసు, రిపోర్ట్‌లు, ప్రస్తుత కండిషన్ చాలా ఆందోళన కలిగిస్తున్నాయి. నువ్వు ఆయనను సజీవుడిగా చూస్తే ఆశ్చర్యమే".

"స్నేహతో అన్నాడు ఆనంద్ - నువ్వు, పిల్లలూ వెళ్ళండి. అదృష్టం బాగుంటే కనీసం ఆయన్ని మీరు సజీవంగా చూస్తారు. నా అదృష్టం భగవంతుడి మీదే వదిలేస్తాను - ఆ భగవంతుని అద్భుత లీలకోసం ప్రార్థిస్తాను. యు అండ్ చిల్డ్రన్ గో"

స్నేహ ఒక్కసారి భర్త ముఖంలోకి చూసింది. అతనిలో - ఆ పాపను రక్షించాలి అనే కోరిక, తండ్రిని సజీవంగా చూడగలను అన్న ఆశా రెండూ కన్పించాయి ఆమెకు.

"జిమ్ - ఒకటే భయంగా ఉంది. ఈ మానసిక పరిస్థితిలో ఇంత క్లిష్టమైన సర్జరీ చేయడానికి ప్రయత్నించడం - ఒక రకమైన పొగరుమోతుతనమే! ఒకవేళ నా పొరబాటు వల్ల ఏదైనా అశుభం జరిగితే జీవితాంతం ఆ విషాదాన్ని మర్చిపోలేను. దేవుడు చల్లగా చూస్తే - నా తండ్రినీ సజీవంగా చూడగలను. ఆయన మృత్యువాత నుంచి బయటపడితే - కొన్ని రోజులు బ్రతుకవచ్చు - సంవత్సరాలు బ్రతకవచ్చు".

"కమ్ - లెట్ అజ్ గో అండ్ సీ ఆలిస్"

ఆనంద్, జిమ్ తిన్నగా హాస్పిటల్‌కి చేరుకున్నారు. ICU బయట కూర్చుంది డాక్టర్ డెబ్బీ. మనిషి మనిషిలా లేదు. పదిలంకణాలు చేసినట్టుంది ఆమె మొహం.

ఆనంద్‌ని చూడగానే లేచి కళ్ళనీళ్ళు తుడుచుకుంది. ఆమె పెదవులపై ఒక చిన్న చిరునవ్వు కన్పించింది.



"డాక్టర్ ఆనంద్ - మిమ్మల్ని చూడగానే వంద ఏనుగుల బలం వచ్చింది నాకు. మై ఆలిస్ ఈజ్ ఇన్ సేఫ్ హేండ్స్"

"ష్యూర్ డెబ్బీ –ఆలిస్‌ని మాకు వదిలిపెట్టు. గో అండ్ టేక్ రెస్ట్' అంటూ ICU లోకి వెళ్ళాడు. తక్కిన డాక్టర్లతో కలిసి అన్ని రిపోర్ట్‌లూ చూశాడు. "కౌంట్ డౌన్ డాక్స్ - రేపు ప్రొద్దున్న 9 గంటలకి సర్జరీకి ప్రిపేర్ చేయండి".

ఇంటికి చేరుకున్నాడు - మొదట చేసిన పని శేఖర్‌కి ఫోన్ చేయడం.

"శేఖర్ - స్నేహ, పిల్లలూ ప్లయిట్‌లో ఉన్నారు. రీసీవ్ దెమ్. ఎలా ఉంది డాడీ కండిషన్".

"ఏమీ దిగజారలేదు"

"ప్లాన్ ప్రకారం ఎల్లుండి బయలుదేరి వస్తున్నాను. వీలయితే ముందు ప్లయిట్‌లో వస్తాను. కానీ వీలు కాకపోవచ్చు. పోస్ట్ ఆపరేటివ్‌కేర్. 24 గంటలు నేనుంటేనే మంచిది. మార్నింగ్ సర్జరీ"

"ఆల్ ది బెస్ట్ - ఇన్ ఎవ్విరిథింగ్ ఫ్రెండ్" ఫోన్ పెట్టేసాడు శేఖర్.

మళ్లీ రాత్రి రెండుసార్లు ఫోన్ చేసాడు.

శేఖర్ జవాబు - "పరిస్థితి దిగజారలేదు".

* * *

ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వచ్చాడు ఆనంద్. ఆతృతగా అతని కళ్లల్లోకి చూసింది డెబ్బీ - ఆమె కళ్లలో నీళ్లు.

ఈసారి అవి ముత్యాల్లా మెరిసిపోతున్నాయి - ఆ తేడా తెలియని ఆనంద్ - ఆమె వైపు వెళ్ళాడు. రెండు భుజాల మీదా చేతులు వేసాడు. పక్కనే ఉన్నాడు డాక్టర్ జిమ్.

"నో టియర్స్ డెబ్బీ - ఆలీస్ ఈజ్ ఫైన్"

ఆపరేషన్ ఫెర్‌ఫెక్ట్‌గా జరిగింది. ఏమీ కాంప్లికేషన్స్ లేవు.

"నో డాక్ - ఇవి టియర్స్ కాదు... టియర్స్ ఆఫ్ జాయ్ - నువ్వు నా ఆలిస్‌ని బ్రతికించావు".

"నేను కాదు. మీరు దేవుడికి చేసిన పూజలు - ఆయన నాకు ఇచ్చిన ఈ చేతులు. ఐ విల్ గో అండ్ చేంజ్" డాక్టర్ ఆనంద్ తన రూమ్‌కి వెళ్ళిపోయాడు.

ఆ రోజు రాత్రి అంతా ICU లోనే గడిపాడు డాక్టర్ ఆనంద్. శేఖర్ ఫోన్ చేసాడు. స్నేహ, పిల్లలూ క్షేమంగా చేరారని. స్నేహ ఫోన్ చేసింది. తండ్రి చాలా సంతోషించారని. శేఖర్ అన్నాడు. ఆయన హాస్పిటల్‌లో చేరిన రెండురోజుల్లో ఆయన ముఖం మీద సంతోషం కన్పించింది అని. అది తనకు ఒక ఆశాకిరణంలాగా కన్పిస్తోందని.

ఆనంద్ స్నేహకు చెప్పాడు. ఆలిస్ సర్జరీ నూటికి నూరుపాళ్ళూ సక్సెస్ అని.

పొద్దున్నే ఇంటికి వెళ్లి బట్టలు మార్చుకుని, ఎయిర్‌పోర్ట్‌కి వెడుతూ ఆలిస్‌ని చూడడానికి హాస్పిటల్‌కు వెళ్ళాడు. ఆలిస్‌ని పరీక్షించాడు.

"డెబ్బీ, జిమ్ - ఆలీస్ ఈజ్ ఫైన్ - వండర్‌ఫుల్ రికవరీ. గో అండ్ సెలిబ్రేట్" ఆనందంగా చెప్పాడు ఆనంద్ వాళ్లిద్దరికీ.

"డాక్" మెల్లిగా అంది డెబ్బీ... పక్కనే నిలుచున్నాడు జిమ్.

"ఏమిటి" అన్నట్టుగా చూసాడు ఆనంద్.

జిమ్ ఇపుడే చెప్పాడు - "మీ ఫాదర్‌కి సీరియస్‌గా ఉందని, అందుకనే స్నేహ, పిల్లలూ ఇండియా వెళ్ళారని, ఆలీస్ సర్జరీ కోసం నువ్వు ఆగిపోయావని... నాతో ఈ విషయం చెప్పవద్దు అని చెప్పావనీ... నీ సహాయం మేం మర్చిపోలేం. ఇట్ ఈజ్ ఎ రియల్ సాక్రిఫైస్. నీకు చేతులెత్తి నమస్కారం చేయాలి. మా పిల్ల ప్రాణం కాపాడావు".

"డెబ్బీ... ఇది నా జీవితంలో అతి కఠోరమైన, భయంకరమైన అనూహ్యమైన సంఘటన. ఒక ప్రక్క తండ్రి చావు బ్రతుకుల మధ్యలో ఊగిసలాడుతున్నాడు. అన్ని పరీక్షలు, రిపోర్ట్లూ ఆయన హృదయం మరికొన్ని గంటలు మాత్రమే స్పందించవచ్చని, ఎప్పుడైనా ఆగిపోవచ్చని చెబుతున్నాయి. దేవుడి అనుగ్రహం ఉంటే నేను ఆయన్ని సజీవంగా కొన్ని క్షణాలు చూడగలిగే అవకాశం ఉంది. అయితే దానికి భగవంతుని చమత్కారం కావాలి - వైద్యుల చేతుల్లోంచి ఆయన పరిస్థితి ఎప్పుడో జారిపోయింది. దేవుడే కాపాడాలి ఆయనను. మ ప్రయత్నం పూర్తిగా జరుగుతోంది. ఇటు పక్క తల్లి ముఖాన్ని కూడా సరిగా చూడని పసికందు - సర్జరీ జరగకపోతే ఆమె హృదయస్పందన, శ్వాస ఆగిపోవడం తప్పదు. నేను తీసుకున్న నిర్ణయంతో భగవంతుడు ఏకీభవిస్తాడు అని నా నమ్మకం".

కారువైపు నడిచాడు ఆనంద్. అతని వైపే చూస్తూ నిలచుండిపోయారు డెబ్బీ, జిమ్.

* * *

ఫ్లయిట్‌లో అంతా తండ్రిని గురించే ఆలోచనలు. మానసికంగా, శారీరకంగా అలసిపోయాడు. ఆలిస్ సర్జరీ విజయవంతమైనందుకు సంతోషం ఒక పక్క, తండ్రి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తోంది మరో పక్క - కునుకు లేదు ఆనంద్‌కి. ఎయిర్‌పోర్ట్ నుంచి తిన్నగా హాస్పిటల్‌కి చేరుకున్నాడు ఆనంద్. ముఖం మీద లేని ధైర్యాన్ని తెచ్చి పెట్టుకున్నాడు. చిరునవ్వు నటిస్తూ తండ్రి గదిలోకి వెళ్ళాడు. అందరూ అక్కడే ఉన్నారు. స్నేహ ఆయనే పక్కనే కూర్చుం

ది. పిల్లలు, రాజా అంకుల్, శేఖర్, తక్కిన డాక్టర్స్.

"హాయ్ డాడీ. నేను వచ్చేసాను. ఆల్ విల్ బి ఫైన్" లేని ధైర్యంతో అరిచాడు ఆనంద్.

నిద్రలో నుంచి లేచినట్టు కళ్లు తెరిచారు రమణారావు. ఆయన కళ్ళు దీపాల్లా మెరుస్తు న్నాయి ఆనందంతో. లేచి కూర్చుని కొడుకుని కౌగలించుకుందామన్నట్టుగా ఆయన కళ్లతోనే సైగ చేసారు. ఆయన పక్కన కూర్చోమన్నట్టు గా. స్నేహతో పాటు ఆనంద్ ఆయన పక్కనే కూర్చున్నాడు.

డాడ్ - నాలుగు రోజుల పసికందు హృద యంపై విజయవంతంగా శస్త్ర చికిత్స చేసాం - ఏదేదో చెబుతున్నాడు ఆనందంగా. ఆనంద్ వైపు చూస్తున్నాయి ఆయన కళ్లు.

డాక్టర్ రాజారావుకి ఆశ్చర్యం వేసింది. ఏమిటీ... ఆ మెరుస్తున్న కళ్లు... ఎంతో మంది, వందల మందిని చివరి ఘడియల్లో ఆయన చూసారు. అటువంటి ప్రశాంతమైన కళ్లు చూడ లేదు.

"డాడీ. భగవంతుడు ఒక పసికందు ప్రా ణం కాపాడే అవకాశం నాకు ఇచ్చాడు. ఆ అవకాశాన్ని నేను జారవిడుచుకోలేదు. ఇంకా ఏదో చెబుతున్నాడు ఆనంద్.

రమణారావు కొడుకు ఆనంద్ చేతిని అందు కుని తన హృదయం మీద పెట్టుకున్నాడు. ఆయన కళ్లల్లో ఏదో తృప్తి. ఏదో సాధించానన్న ఆనందం, సంతోషం. పెదవులపై చిరునవ్వు. కళ్లు మెల్లగా మూసుకుంటున్నాయి. మగత నిద్ర వస్తున్నట్టుగా. మరి మెలకువ లేని శాశ్వత నిద్ర అది. కళ్లు పూర్తిగా మూసుకుపోయాయి. ఆయన చేతులు ఆనంద్ చేతులను వదిలేసా యి. పెదవుల మీద చిరునవ్వు అలాగే ఉండి పోయింది. డాక్టర్లు ఆఖరి నిమిష ప్రయత్నాలు... ఆనంద్‌కి తెలుసు అంతా అయిపోయింది అని.

"యూ కాంట్ దూ దిస్ టుమి డాడ్ - యూ కాంట్ లీవ్ మి ఎలోన్" గట్టిగా అరిచి, కుప్పగా కూలిపోయాడు తండ్రి హృదయం మీద ఆనంద్.

అతని రెండు భుజాల మీదా నాలుగు చేతు లు వాలాయి - అవి స్నేహ - రాజా అంకు ల్‌వి. నీవు ఏకాకివి కావు - మేం నీ కూడా ఉన్నాం' అన్నట్టుగా.

"మీ నాన్నకి నువ్వు ప్రపంచ వైద్యరంగంలో సంపాదించిన గౌరవం, నువ్వు సాధించిన ఘన విజయాలు ఎంత ఆనందం ఇచ్చాయంటే - ఆ ముసలి హృదయం తట్టుకోలేకపోయింది...

నువ్వు మీ నాన్న ఆత్మ శాంతికి చేయవల సిన, సాధించవలసినవి ఇంకా ఎన్నో ఉన్నాయి - ఇది నీకు ఒక పరీక్ష - ఒక ఛాలెంజ్. లివ్ అప్ టు హిస్ ఎక్స్‌పెక్టేషన్స్" ధైర్యం చెప్పారు రాజా అంకుల్.

డాక్టర్ ఆనంద్ ఒక్క క్షణం ఆలోచించాడు. తండ్రి రిపోర్ట్‌లు, టెస్ట్‌లూ అన్నీ చెబుతున్నాయి. ఆయన జీవితం ఇక కొద్ది గంటలు కంటే ఎక్కు వ లేదని. అయితే ఆయన 72 గంటలుపైగా బ్రతికారు. తనను, తన భార్యను - అదే కూతు రులాగ ప్రేమించిన కోడల్ని, మనమల్నీ అం దర్నీ చూసారు. దీవించారు. ఇది ఎలా సాధ్య మయింది?

"తండ్రి మరణశయ్య మీద ఉన్నా - తను శాసించిన విధంగా చిన్న పసికందుకు ప్రాణ దానం చేసాడ"ని తన మీద భగవంతుడు కని కరించి - తన తండ్రిని సజీవంగా చూడడానికి వరం ఇచ్చాడా?" ●